సాక్షి ఖమ్మం
ఆదివారం । 30 । జూన్ । 2024



'సన్న' విత్తనాలకు డిమాండ్

సన్నరకం వరి ధాన్యానికి బోనస్ ప్రకటించిన నేపథ్యాన సాగుకు రైతుల్లో ఆసక్తి పెరగడంతో విత్తనాలకు డిమాండ్ ఏర్పడింది. 10లో



సమరశీల పోరాటాలు

ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు పోరాటాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు పిలుపునిచ్చారు. 8లో


వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 25°

జిల్లా అంతటా ఆదివారం ఆకాశం మేఘావృతమై పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

కొత్తకొత్తగా.. చట్టాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: బ్రిటిష్ కాలం నుంచి ఉన్న చట్టాల స్థానంలో కొత్తవాటిని రూపొందించారు. ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మార్పులు, చేర్పులతో వీటిని రూపొందించగా.. న్యాయసంబంధ విధానాలను సరళతరం చేయడంతోపాటు తీవ్రమైన నేరాల్లో కఠినమైన శిక్ష విధించేలా సెక్షన్లలో మార్పులు చేశారు. పిటీ కేసుల్లో నేరాలకు పాల్పడిన వారికి సమాజ సేవ శిక్ష విధించడం, నేరాల్లో డిజిటల్ సాక్ష్యాధారాలకు ప్రాధాన్యత, ఏ పోలీస్‌స్టేషన్‌లోనైనా ఫిర్యాదుకు అవకాశం కల్పించడమే కాక ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేలా ఈ చట్టాల ద్వారా వెసులుబాటు లభించనుంది. న్యాయ వ్యవస్థపై మరింత విశ్వాసం పెంపొందించడంతో పాటు కేసుల సత్వర పరిష్కారానికి ఈ నూతన చట్టాలు అవకాశం కల్పిస్తాయని చెబుతున్నారు. ఈమేరకు సోమవారం నుంచి కొత్త చట్టాలు అమల్లోకి రానున్న నేపథ్యాన కథనం.



రేపటి నుంచి అమల్లోకి...

- ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూపకల్పన
- బాధితులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసుకునే వెసులుబాటు
- దర్యాప్తు చేయడానికి కాలపరిమితి
- పిటీ కేసుల్లో శిక్షగా సమాజసేవ

మూడు చట్టాల స్థానంలో..

ఇప్పటి వరకు అమల్లో ఉన్న సీఆర్‌పీసీ, ఐపీసీ, ఎవిడెన్స్ యాక్ట్ చట్టాలను మార్చి బీఎన్ఎస్ఎస్, బీఎన్ఎస్, భారతీయ సాక్ష్య అధీనియం చట్టాలను అమలు చేయనున్నారు. ఇందులో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ) స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య అధీనియం చట్టాలు రానున్నాయి. చట్టాల్లో అవసరమైన మార్పులు, చేర్పులు చేసి భద్రమైన జీవితం, స్వేచ్ఛకు విఘాతం కలగకుండా రూపొందించారు. ఈ మేరకు నేర పరిశోధనలో పోలీసులకు అదనపు అధికారాలు లభించగా.. బీఎన్ఎస్ఎస్ చట్టం ట్రయల్ ప్రాసెస్‌ను క్రమబద్ధీకరిస్తుంది. అంతేకాక న్యాయస్థానాలు నిర్దిష్ట కాలవ్యవధిలో కేసులు పరిష్కరించే వీలు కలుగుతుంది.

డిజిటల్ సాక్ష్యాలైనా సరే...

భారతీయ నాగరిక్ సురక్ష సంహిత–2023ను క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ)–1973 స్థానంలో తీసుకొస్తున్నారు. బీఎన్ఎస్ఎస్ ద్వారా ఏడేళ్ల, అంత కన్నా ఎక్కువ జైలుశిక్ష విధించే నేరాలకు ఫోరెన్సిక్ విచారణను తప్పనిసరి చేశారు. అన్ని ట్రయల్స్, విచారణలు, ప్రొసీడింగ్‌లను ఆన్‌లైన్‌లో నిర్వహించే వెసులుబాటు లభిస్తుండగా, డిజిటల్ సాక్ష్యాలను సైతం ఆమోదిస్తారు. ఈ చట్టం ద్వారా 15 రోజుల వరకు పోలీస్ కస్టడీని అమలుచేస్తుంది. అలాగే చట్టంలో 60 లేదా 90 రోజులు జ్యూడీషియల్ కస్టడీకి అనుమతి ఉంది. గత ఏడాది ఆగస్టు 11నే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత –2023(బీఎన్ఎస్ఎస్)ను ప్రవేశపెట్టారు.

పోలీసులు, న్యాయవాదులకు శిక్షణ

కొత్త చట్టాలపై పోలీసులతో పాటు న్యాయవాదులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఉద్యోగులకు ఇటీవల కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లాలోని 25 పోలీస్ స్టేషన్లతోపాటు ట్రాఫిక్, మహిళ, సీసీఎస్, సైబర్ క్రైమ్, టాస్క్‌ఫోర్స్, సీసీఆర్బీ, ఐటీ కోర్ టీమ్‌లకు సంబంధించి 888 మంది సిబ్బందికి విడతల వారీగా, బ్యాచ్‌కు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఇక న్యాయవాదులకు ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం శిక్షణ ఏర్పాటుచేశారు.

ఇంటి నుంచే సేవలు..

కొత్త చట్టాల ఆధారంగా వివిధ కేసుల్లో సాక్షులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. బాధితులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం లభించనుంది. అయితే, ఫిర్యాదు చేశాక మూడు రోజుల్లోగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలి. ఇక మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితోపాటు 15 ఏళ్లలోపు పిల్లలు, 60 ఏళ్లకు మించి వయస్సు వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన పనిలేకుండా నివసిస్తున్న చోటు నుంచే పోలీసుల సాయం పొందొచ్చు. అంతేకాక పోలీస్‌స్టేషన్ పరిధికి మినహాయింపు ఇస్తూ ఎక్కడ ఫిర్యాదు చేసినా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చు. మహిళలు, చిన్నారుల పట్ల జరిగే ఏహ్యమైన నేరాల విషయంలో వీడియోగ్రఫీ ద్వారా రెండు నెలల్లో దర్యాప్తుపూర్తిచేయాలి. తద్వారా నాణ్యతకు పెద్ద పీట వేసినట్లవుతుంది. అలాగే ఐపీసీలోని సెక్షన్ 377, 497లను రద్దు చేశారు.

కొత్త చట్టాలతో కేసుల సత్వర పరిష్కారం

- పిటీ కేసుల్లో శిక్షగా సమాజ సేవ
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్


రాజగోపాల్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఖమ్మంలీగల్: 'నేరాల సంఖ్యను తగ్గించడం, చట్టాలను మరింత బలోపేతం చేయడం, శాస్త్రీయ పద్ధతిలో మెరుగైన విధానంలో, నిర్దేశిత కాలపరిమితిలో దర్యాప్తు నిర్వహించడం మూడు చట్టాల ముఖ్యఉద్దేశం. నేరాల్లో డిజిటల్ సాక్ష్యాన్ని డాక్యుమెంట్‌గా పరిగణించే వెసులుబాటు కల్పించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేయడమే కాక అవసరం లేని పదాలను తొలగించి పాత చట్టాలను ప్రక్షాళన చేశారు. కొత్త చట్టాల అమలుతో నిబంధనలు, సెక్షన్లు మారాయి. సామాన్యుడికి సుఖమయ జీవితం, స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడటమే ముఖ్య ఉద్దేశం. అంతే కాక నిందితుల హక్కులను కూడా బలోపేతం చేశారు.' అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. కొత్త చట్టాలు అమల్లోకి రానున్న నేపథ్యాన శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో జిల్లా జడ్జి వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..

మార్పులు, చేర్పులిలా..

సీఆర్‌పీసీలో 484 సెక్షన్లు ఉండగా.. కొత్తగా వచ్చే భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్)లో 531 సెక్షన్లు ఉన్నాయి. సత్వర న్యాయం అందించడానికి 35 నేరాల్లో నిర్దిష్టమైన సమయంలోగా తుది తీర్పు వెల్లడించాలి. ఇక ఐపీసీలో 511 సెక్షన్లు ఉండగా.. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లో 358 సెక్షన్లు ఉన్నాయి. ఇందులో కొత్తగా 20 నేరాలను చేర్చారు. కొన్ని నేరాలకు జైలుశిక్ష, 93 నేరాలకు జరిమానా పెంచారు. ఆరు నేరాల్లో సమాజసేవను శిక్షగా విధించాలి. ఇక భిక్షాటన, మానవ అక్రమ రవాణాను కఠిన నేరంగా పేర్కొన్నారు. అలాగే, భారతీయ సాక్ష్య అధీనియంలో 178 సెక్షన్లు ఉన్నాయి. ఎవిడెన్స్ యాక్ట్‌తో పోలిస్తే ఆరింటిని తొలగించి రెండు కొత్త సెక్షన్లు, ఆరు సబ్ సెక్షన్లు చేర్చారు. నిందితుల హక్కులను బలోపేతం చేయడం కూడా ఈ చట్టాల ఉద్దేశం. విచారణ సమయంలో న్యాయవాదిని ఎంపిక చేసుకునే హక్కు, అరెస్ట్ వెంటనే వైద్యాధికారులతో పరీక్షలు, అరెస్ట్‌కు కారణాలను తెలుసుకునే హక్కు లభిస్తుంది.

మూకదాడికి ఉరిశిక్ష

బీఎన్ఎస్‌లో వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాదం, మూకదాడితో హత్యకు పాల్పడడం వంటి వాటిని చేర్చారు. మత మార్పిడికి పురిగొల్పడం, సాయుధ తిరుగుబాటు, విద్రోహచర్యలు, దేశ సార్వభౌమాధికారం సమగ్రతకు భంగం కలిగించడం, ఆర్థిక, ఎలక్ట్రానిక్ సమాచార వ్యవస్థను నేరాల్లో వినియోగించడం ఈ చట్టం ద్వారా నేరంగా పరిగణిస్తారు. ఆర్థిక భద్రతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడడం కూడా ఉగ్రవాద చర్యల కిందకే వస్తాయి. ఒకవర్గం ప్రజలపై దాడులు చేయడం నేరం. మూకదాడుల్లో ఏడేళ్ల శిక్ష నుంచి యావజ్జీవ కారాగార శిక్ష, మరణశిక్ష విధించొచ్చు.

చట్టాలపై ఉద్యోగులకు అవగాహన


సునీల్‌దత్, పోలీసు కమిషనర్

ఖమ్మంక్రైం: కొత్త చట్టాలు అమల్లోకి రానున్నందున దర్యాప్తు, ఆధారాల సేకరణ తదితర అంశాల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఈ నేపథ్యాన పోలీసు ఉద్యోగుల్లో అవగాహన కోసం శిక్షణ ఇచ్చినట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ వెల్లడించారు. ఈ సందర్భంగా సీపీ శనివారం 'సాక్షి'కి వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే...

దర్యాప్తులో వేగం..

బాధితుడు ఇకపై ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. పోలీసుస్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఎక్కడైనా ఫిర్యాదు చేసే అవకాశముంటుంది. ఇక పోలీసు సిబ్బంది సైతం సమన్లను నేరుగా ఇచ్చే అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనూ జారీ చేయొచ్చు. తద్వారా కాగిత వినియోగం తగ్గుతుంది. పోక్సో కేసులు, మహిళలకు సంబంధించిన కేసుల్లో 60రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాల్సి ఉంటుంది. మిగిలిన కేసుల్లో 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలి. తద్వారా కేసుల దర్యాప్తు, విచారణలో వేగం పెరుగుతుంది. అయితే, ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం ఈ కాలపరిమితికి మినహాయింపు ఉంటుంది. కాగా, ఎవరినైనా అరెస్ట్ చేస్తే ఆ వ్యక్తి కుటుంబసభ్యులు, బంధువులకు తన పరిస్థితిని తెలియచేయొచ్చు. ఫలితంగా తక్షణ సాయం లభిస్తుంది. అంతేకాక బాధితులు, నిందితులకు ఎఫ్ఐఆర్ కాపీ ఉచితంగా ఇస్తారు, పోలీస్ రిపోర్ట్, చార్జిషీట్లను రెండు వారాల్లో పొందవచ్చు. కొత్త చట్టాలపై జిల్లాలోని పోలీసు ఉద్యోగులకు అవగాహన కలిగేలా శిక్షణ ఇచ్చాం.





న్యూస్‌రీల్

నేడు జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/మధిర/చింతకాని: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు ఖమ్మం చేరుకోనున్న ఆయన స్తంభాద్రి ఆస్పత్రిని ప్రారంభిస్తారు. అనంతరం చింతకాని మండలం గాంధీనగర్, మధిర మండలం వంగవీడులో రహదారుల నిర్మాణం, విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత మధిర మండలం చిలుకూరు, మర్లపాడు, మాటూరులో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న భట్టి, రాత్రి మధిరలోనే బస చేసి సోమవారం ఉదయం హైదరాబాద్ బయలుదేరతారు.

హెచ్‌డబ్ల్యూఓ నియామక పరీక్ష ఆలస్యం

- సర్వర్ మొరాయించడమే కారణం

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం రూరల్: హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల నియామకానికి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పరీక్ష శనివారం సర్వర్ మొరాయించడంతో ఆలస్యమైంది. ఖమ్మం జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో ఈనెల 24వ తేదీ నుంచి రోజుకు రెండు సెషన్లలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్న పరీక్షలు శనివారం ముగిశాయి. అయితే, చివరి రోజు మధ్యాహ్నం 2–30గంటలకు మొదలుకావాల్సిన పరీక్ష ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో సుమారు 3గంటలు ఆలస్యమైంది. ఈ విషయమై అధికారులను సంప్రదించగా సర్వర్ సమస్యతోనే పరీక్ష ఆలస్యమైందని తెలిపారు. ఈమేరకు 90మంది అభ్యర్థులకు సాయంత్రం 5గంటల నుంచి, మరో ఐదుగురికి ఆ కాసేపటికి పరీక్ష మొదలుకాగా.. యథావిధిగా 2–30గంటల సమయం ఇచ్చినట్లు వెల్లడించారు. అయితే, పరీక్ష రాసేందుకు పలువురు మహిళా అభ్యర్థులు చిన్న పిల్లలతో రాగా ముగిసే వరకు చీకటి పడడంతో వారి బంధువులు కేంద్రం వద్ద పడిగాపులు కాస్తూ కనిపించారు.

హైదరాబాద్ మాదిరి ఖమ్మంకూ ఓఆర్ఆర్

- రహదారుల అభివృద్ధికి రూ.654కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మాట్లాడుతున్న మంత్రి నాగేశ్వరరావు, పక్కన మేయర్ నీరజ తదితరులు


బైక్ నడుపుతున్న మంత్రి తుమ్మల, వెనకాల వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఖమ్మంవన్‌టౌన్: హైదరాబాద్ చుట్టూ ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్డు) ఉన్నట్లే ఖమ్మం నగరం చుట్టూ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను అనుసంధానం చేస్తూ అనేక జాతీయ రహదారులకు గతంలోనే ప్రతిపాదనలు పంపించగా, కొన్నింటికి నిధులు మంజూరు కావడమే కాక పనులు మొదలయ్యాయని తెలిపారు. ఇందులో భాగంగా కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు 25 కి.మీ. మేర బైపాస్ రోడ్డుకు రూ.450 కోట్లు, ఎన్‌హెచ్ 365ఏ, ఎన్‌హెచ్163జీను అనుసంధానం చేసేలా 6 కి.మీ. రహదారికి రూ.125కోట్లు, భద్రాచలంలో ఎన్‌హెచ్30 అభివృద్ధికి రూ.50కోట్లు, కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద ఎఫ్‌ఓబీ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.64కోట్లు, ఎన్‌హెచ్30 కిన్నెరసాని నదిపై హెచ్ఎల్‌బీ క్రాస్ బ్రిడ్జికి రూ.20.22కోట్లు, ఖమ్మంలోని కోదాడ క్రాస్ నుండి వరంగల్ క్రాస్ వరకు ఉన్న రోడ్డు అభివృద్ధికి రూ.7కోట్లు కలిపి రూ.654.86కోట్లను కేంద్రం మంజూరు చేసిందన్నారు. ఇందుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. ఇక ధంసలాపురం వద్ద హైవేకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఇవ్వాలని ప్రజలు కోరుతుండగా.. రహదారిని సుమారు 18 అడుగుల ఎత్తుతో నిర్మాణం చేపట్టాల్సి వస్తుందన్నారు. ఇందుకు రూ.70కోట్లు అవసరం కావడంతో సర్వీస్ రోడ్లతో అనుసంధానించాలని ప్రతిపాదించినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే, వరంగల్ క్రాస్ రోడ్డు నుండి మున్నేరు మీదుగా ఎన్టీఆర్ సర్కిల్, శ్రీశ్రీ సర్కిల్ వద్ద ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలుస్తాం...

ఏన్కూరు: సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్ నిర్మాణంలో భాగంగా భూమి కోల్పోయిన రైతులకు అండగా నిలుస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు హామీ ఇచ్చారు. ఏన్కూరు మండలం హిమామ్‌నగర్‌లో జరుగుతున్న సీతారామ లింక్ కెనాల్ పనులను శనివారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. వచ్చే నెల 4నుంచి భూముల ధరలు పెరుగుతాయని, అందుకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి రైతులకు న్యాయంగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాక నిర్వాసిత రైతుల పిల్లలకు విద్యార్హతల ఆధారంగా ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. అయితే, ఆగస్టు 15 నాటికి కెనాల్ పనులు పూర్తయ్యేలా అధికారులు రాత్రీ,పగలు పర్యవేక్షించాలని ఆదేశించారు. కాగా, కెనాల్ పరిశీలనకు వచ్చిన మంత్రి బైక్‌పై వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ను ఎక్కించుకుని పనిప్రదేశానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాల్ల దుర్గప్రసాద్‌తో పాటు గుత్త వెంకటేశ్వరావు, బొర్రా రాజశేఖర్, స్వర్ణ నరేందర్, వేముల కృష్ణప్రసాద్, వాసిరెడ్డి నాగేశ్వరావు, మాలోతు నర్సింహారావు, కరణం ప్రసాద్, కట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివా రం అర్చకులు శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీవారి పాదంతో పాటు స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించడంతో పాటు పల్లకీ సేవ నిర్వహించగా తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి పోటీలు


మెడిసిన్ బాల్‌త్రో పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్: స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతి ప్రవేశాలు కల్పించేందుకు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఎంపిక పోటీలు శనివారం ముగిశాయి. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యాన ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో మూడు మండలాలకు చెందిన 35 మంది పాల్గొనగా ఏన్కూరు నుంచి అత్యధికంగా 24 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూలై 9, 10 తేదీల్లో సికింద్రాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలి పారు. కోచ్‌లు, పీడీలు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, నగేష్, కైలాష్, ఎం.సుధాకర్, కృష్ణమూర్తి, కృష్ణయ్య, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

మెగా ఫుడ్‌పార్క్‌ను పరిశీలించిన డీఆర్‌డీఓ



యూనిట్ల పనితీరును పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం బుగ్గపాడులోని మెగా ఫుడ్‌పార్క్‌ను డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఈజీఎస్ ఏపీడీ వెంకటపతిరాజు శనివారం పరిశీలించారు. ఫుడ్‌పార్క్‌లోని ప్రాసెసింగ్ యూనిట్లు, జిల్లా సమాఖ్య ద్వారా మంజూరైన ప్లగ్ అండ్ ప్లే ప్రాసెస్ యూనిట్ పనివిధానం, మామిడి డైస్ వివరాలు ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో సైట్ ఇన్‌చార్జ్ రామకృష్ణ, డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం సుబ్బారావు, సీసీలు రామారావు, శ్రీనివాస్, కృష్ణ, నరేందర్ పాల్గొన్నారు.

ఎస్సైలను అభినందించిన సీపీ




ఎస్సైకి స్టార్ అందజేస్తున్న సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఏఎస్సైలుగా విధులు నిర్వర్తిస్తున్న పలువురిని ఇటీవల ఎస్సైలుగా పదోన్నతి లభించింది. పదోన్నతి లభించిన వారిలో కట్టా సుబ్బారావు, ఏ.భీమా, విష్ణుమూర్తి, ఓ.సుబ్బారావు ఉన్నారు. ఈ సందర్భంగా శనివారం వారిని సీపీ సునీల్‌దత్ అభినందించారు.

రేపు పండితాపురం సంత వేలం

కామేపల్లి: పశువుల క్రయవిక్రయాలకు రాష్ట్రంలోనే పేరున్న కామేపల్లి మండలం కొమ్మినేపల్లి (పండితాపురం)లోని శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారాంతపు సంత బహిరంగ వేలం పాట సోమవారం నిర్వహించనున్నారు. సంత ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం మొదలవుతుందని ఎంపీడీఓ రవీందర్ తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు కాలపరిమితితో నిర్వహించే వేలంలో పీసా చట్టం ప్రకారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. రూ.30 లక్షల ధరావతు, రూ.5 లక్షల సాల్వెన్సీని డీడీ లేదా నగదు రూపంలో చెల్లించి పాల్గొనాలని సూచించారు.

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందచేస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి: కూసుమంచి మండలం పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల మత్స్యకారులకు ఇస్తున్న మూడు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ చేపల పెంపకంలో రీ సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ తదితర విధానాలపై అవగాహన పెంచుకుంటే లాభాలు వస్తాయని తెలిపారు. మత్స్య శాస్త్రవేత్త రవీందర్, సీనియర్ రీసెర్చ్ ఫెలోలు భార్గవి, నాగరాజు, మోతె వెటర్నరీ అసిస్టెంట్ మమత తదితరులు పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్లు సీజ్

అశ్వాపురం: మండల కేంద్రంలో కిరాణాదుకాణాల్లో, పాన్ షాపుల్లో ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన ఓ సూపర్ మార్కెట్లో సుమారు రూ.17 వేల విలువైన నిషేధిత అంబర్, గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఐదు నెలల జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: టీవీ చోరీ కేసులో నిందితుడికి ఐదు నెలల జైలు శిక్షను విధిస్తూ శనివారం కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి బత్తుల రామారావు తీర్పు చెప్పారు. తన ఇంట్లో ఎల్‌ఈడీ టీవీ చోరీకి గురైందని కొత్తగూడెం రామా టాకీస్ ఏరియాకు చెందిన రాజు 19.2.2024న వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు చుంచుపల్లి మండలం పెనుబల్లికి చెందిన ఎనుముల సాంబశివరావు వద్ద టీవీ రికవరీ చేశారు. అనంతరం కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. న్యాయస్థానంలో సాంబశివరావు నేరాన్ని అంగీకరించగా జడ్జి ఐదు నెలల జైలుశిక్షతో పాటు రూ.200 జరిమానా విధించారు. కొత్తగూడెం వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.కరుణాకర్, పీసీ ఏ.నర్సింహారావు సహకరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

యూరియా వచ్చేసింది!



ఖమ్మం స్టేషన్ వద్ద లారీల్లో లోడ్ చేస్తున్న యూరియా

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పంటల సాగు ఊపందుకుంటోంది. ఈనేపథ్యాన రైతులకు అవసరమైన వివిధ కంపెనీల యూరియా జిల్లాకు చేరుకుంటోంది. ఖమ్మంలోని రైల్వేస్టేషన్లకు గూడ్స్ వ్యాగన్ల ద్వారా వస్తున్న యూరియాను స్టాక్ పాయింట్లకు.. అక్కడి నుంచి మండలాల్లో గోదాంలకు తరలిస్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రైతుల సూచనల మేరకే 'భరోసా'

- జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల
- ఐదు నుంచి పది ఎకరాల వరకే ఇవ్వాలన్న అన్నదాతలు



మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

కారేపల్లి: ప్రభుత్వం అమలుచేస్తున్న 'రైతు భరోసా' పథకంలో రైతుల సూచనలు, సలహాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల వెల్లడించారు. రైతు భరోసా సాయానికి పరిమితి విధించాలని ప్రభుత్వం భావిస్తుండగా రైతుల అభిప్రాయాలు సేకరించేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కారేపల్లి సొసైటీ కార్యాలయంలో శనివారం చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఏఓ పాల్గొని రైతుల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనర్హులకు రైతుభరోసా అందుతుందనే ఆరోపణలతో మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. కాగా, ప్రతీ రైతుకు 10ఎకరాలకు మించకుండా పెట్టుబడి సాయం ఇవ్వాలని కొందరు రైతులు, ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని ఇకొందరు సూచించగా, మరికొందరు ఐదెకరాల వరకే ఇవ్వాలని సూచించారు. అలాగే, కౌలు రైతులకు సాయం పెట్టుబడి సాయం, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు ధరావత్ మంగీలాల్, ఏఓకె ఉమామహేశ్వరరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్.ఉషారాణి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ పి జగదీష్ కుమార్, వి ఇందుమతి, డైరెక్టర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు

- సభ్యులకు నిరంతరం రాజకీయ శిక్షణ
- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్‌లో ఎమ్మెల్యే కూనంనేని



మాట్లాడుతున్న సాంబశివరావు, వేదికపై నారాయణ, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాట అజెండా రూపొందించుకోవాలని తెలిపారు. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశం శనివారం ఖమ్మంలో పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజలను విస్మరించి పాలకవర్గాలు పాలన సాగిస్తుంటే, ప్రజల పక్షాన కమ్యూనిస్టులుగా నిలవాలని చెప్పారు. దేశ ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా తీర్పునిచ్చిన విషయాన్ని మతోన్మాద శక్తులు గమనించాలని సూచించారు. మోదీ ప్రభుత్వం ప్రధానమైన వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను కార్పొరేట్లకు తాకట్టు పెట్టాలని చూస్తోందని ఆరోపించారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ బీఆర్‌ఎస్‌ను చంపే ప్రయత్నంలో ఉంటే బీజేపీ బలపడే అవకాశం ఉందని తెలిపారు. ఈమేరకు కాంగ్రెస్, బీజేపీయేతర పక్షాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్టీ లేని గ్రామాలే లక్ష్యంగా మండల, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. పార్టీ సభ్యులకు ఇక నుంచి నిరంతర రాజకీయ సైద్ధాంతిక శిక్షణ ఇవ్వనున్నట్లు కూనంనేని వెల్లడించారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ నడుమ వివాదం

ఇద్దరినీ బదిలీ చేసిన ఉన్నతాధికారులు

ఖమ్మంక్రైం: ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–2లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ మధ్య నెలకొన్న వివాదం పెరగడంతో ఇద్దరి బదిలీకి దారితీసింది. అయితే మహిళా ఎస్‌ఐను ఏజెన్సీ ప్రాంత చెక్‌పోస్టుకు, హెడ్ కానిస్టేబుల్‌ను జిల్లా కేంద్రంలోనే ఇంకో స్టేషన్‌కు బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎక్సైజ్ స్టేషన్–2 ఎస్‌ఐ సరితకు, హెడ్‌కానిస్టేబుల్ నాయక్‌ను తిరుమలాయపాలెం మండలంలో తనిఖీలకు వెళ్లాలని సీఐ చంద్రమోహన్ నాలుగు రోజుల క్రితం సూచించారు. అక్కడకు వెళ్తున్న క్రమంలో వాహనంలోనే కాక స్టేషన్‌కు వచ్చాక సీఐ సమక్షాన సైతం ఇద్దరి నడుమ వాగ్వాదం జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ తనను అసభ్యంగా దూషించాడంటూ ఆయన చెంపపై ఎస్‌ఐ కొట్టినట్లు తెలిసింది. అనంతరం ఈనెల 27న ఉదయం హెడ్‌కానిస్టేబుల్ తరఫున అసోసియేషన్, పార్టీల నాయకులు, ఎస్‌ఐ తరఫున ఆమె కుటుంబసభ్యులు చర్చించారు. ఆపై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఈఎస్ నాగేందర్‌రెడ్డి విచారణ చేపట్టి శాఖ కమిషనర్ దృష్టికి తీసకెళ్లారు. ఆయన సూచనలతో ఇద్దరినీ బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదంతా పక్కన పెడితే సమర్థవంతమైన అధికారిగా పేరున్న మహిళా ఎస్‌ఐను ఏజెన్సీ ప్రాంత చెక్‌పోస్టుకు, సరిపడా సిబ్బంది ఉన్నా జిల్లాకేంద్రంలోనే ఎక్సైజ్ స్టేషన్–1కు హెడ్‌కానిస్టేబుల్‌ను బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. కాగా, స్టేషన్‌లో ఏళ్ల తరబడి తిష్ట వేసి ఉన్న కొందరు సిబ్బందే ఈ గొడవకు కారణమని తెలుస్తోంది. మరోపక్క సర్దిచెప్పాల్సిన ఎక్సైజ్ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడమే గొడవ పెరగడానికి కారణమని చెబుతున్నారు.

ఎండు గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు


ఖమ్మంక్రైం: ఖమ్మం పాత బస్టాండ్ ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు శనివారం నిర్వహించిన తనిఖీల్లో ఎండు గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంలోని శాంతినగర్, చెరువు బజార్, పాకబండ బజార్‌తో పాటు జిల్లాలోని మైలవరానికి చెందిన బండారు తరుణ్, చిండె బాజీ, షేక్ నన్నెసాహెబ్, షేక్ మస్తాన్, ఇట్టి నాగవంశీ, చిండె నాగేంద్రమ్మ, కిష్టా కోటేశ్వరరావు ముఠాగా ఏర్పడి ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గంజాయిని ఖమ్మంలో విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా వీరిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు 1,100 గ్రాముల ఎండుగంజాయి, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో సీఐ బి.కృష్ణ, ఎస్సైలు ఎస్.జయశ్రీ, సాయిబాబా, ఉద్యోగులు రామారావు, శశికాంత్, రమేష్ పాల్గొన్నారు.

నా భార్యా,కుమారుడిని చేరదీయండి

- అండగా ఉండాల్సిన నేను వెళ్లిపోతున్నా..
- లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్న ఫొటోగ్రాఫర్



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)



శ్రీనివాస్‌రెడ్డి రాసిన లేఖ

ఖమ్మంక్రైం: 'మానస నువ్వంటే చెప్పలేనంత ప్రేమ. అనారోగ్యంతో బాధపడుతున్న నీకు తోడగా ఉండాల్సింది పోయి వెళ్తున్నా.. మన కుమారుడు నమన్‌రెడ్డిని జాగ్రత్తగా చూసుకో.. నాన్నా(కుమారుడిని ఉద్దేశించి) నీ చెయ్యి పట్టుకుని ప్రపంచాన్ని చూపించాల్సి ఉన్నా చేయి విడిచిపెట్టి పోతున్నాను. నన్ను క్షమించండి. అమ్మ, అక్క, తమ్ముళ్లు, అత్తయ్య, మామయ్యలు, బాబాయిలు, పిన్నిలు మీరంతా నా కొడుకు, భార్యను జాగ్రత్త గా చూసుకోండి. నాపై కోపం ఉంటే వారిపై చూపకుండా చేరదీసి ఆదుకోండి' అంటూ లేఖ రాసిన ఓ ఫొటోగ్రాఫర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడెంకు చెందిన ఎరసాని శ్రీనివాస్‌రెడ్డి(40) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ భార్య మానస, కుమారుడు నమన్‌రెడ్డితో కలిసి ఉంటున్నాడు. అయితే కొంత కాలంగా ఆయన లోన్‌యాప్‌లు, క్రెడిట్‌కార్డుల ద్వారా తీసుకున్న అప్పులు పెరిగి తీర్చలేని పరిస్థితి ఎదురైనట్లు తెలుస్తోంది. దీంతో ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈనేపథ్యాన కొన్నాళ్ల క్రితం ఖమ్మంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో శుక్రవారం సాయంత్రం ఇక్కడకు చేరుకుని లాడ్జీలో గది అద్దెకు తీసుకున్నాడు. శనివారం ఉదయం ఆయనకు టీ ఇవ్వడానికి వెళ్లిన సిబ్బంది ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి తలుపులు పగులకొట్టి చూడగా శ్రీనివాస్‌రెడ్డి ఉరి వేసుకుని కనిపించాడు. ఆయన వద్ద లభించిన లేఖ, చిరునామా ఆధారంగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కాగా, అప్పులు పెరగడంతో తీర్చే మార్గం లేక బలవన్మరణానికి పాల్పడగా, శ్రీనివాసరెడ్డి తన భార్య, కుమారుడిని విడిచిపెట్టలేక సంఘర్షణకు గురైనట్లు లేఖ ద్వారా తెలియడంతో చదివిన వారంతా కంటతడి పెట్టారు. కాగా, ఆయన మృతదేహాన్ని అన్నం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు, సిబ్బంది సాయంతో మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టుటౌన్ ఎస్‌ఐ రఫీ తెలిపారు.

■ ఆకేరు చెక్‌డ్యామ్‌లో దెయ్యం చేపలు!

మండలంలోని బీసురాజుపల్లి ఆకేరు చెక్‌డ్యామ్ నీటిలో గిరిజనులకు సముద్ర జలాల్లో మాత్రం కనిపించే వింత రకం చేపలు లభించాయి. సముద్ర జలాల్లో మాత్రమే తిరిగే ఈ చేపలను అక్వేరియంల్లోనూ పెంచుతారని తెలుస్తోంది. స్థానికంగా వీటిని దయ్యం చేపలుగా పిలుస్తుండగా, వరదల సమయాన ఆకేరు చెక్‌డ్యామ్‌లోకి చేరినట్లు భావిస్తున్నారు. కాగా, ఇవి చెరువుల్లోకి చేరితే ఇతర చేపల అభివృద్ధికి ఆటంకంగా మారుతాయని మత్స్యకారులు చెబుతున్నారు.

– తిరుమలాయపాలెం



చెక్‌డ్యాంలో లభించిన చేపలు

అందుబాటులోకి రూ.20 నాణేలు !



రూ.20 నాణెం

ఖమ్మం సహకారనగర్: ఇన్నాళ్లు రూ.1, రూ.2, రూ.5, రూ.10 నాణేలు మాత్రమే అందుబాటులో ఉండగా ఇప్పుడు రూ.20 నాణేలు సైతం మార్కెట్‌లోకి వచ్చాయి. ఖమ్మంలోని పలువురు వ్యాపారులు బ్యాంకుల నుంచి వీటిని తీసుకోగా.... వినియోగదారులకు ఇస్తున్నారు. అయితే, ఈ నాణేలు కొత్తగా ఉండడంతో తీసుకునేందుకు ప్రజలు తటపటాయిస్తున్నా ఇటీవలే వచ్చాయని చెప్పడంతో ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. నాణేం ముందు భాగంగా 20నంబర్‌తోపాటు ట్వంటీ రూపీస్, బీస్ రూప్‌యా అని, వెనుక భాగంలో మూడు సింహాల బొమ్మతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రణాళిక

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు ప్రణాళికలు తయారుచేసి అమలు చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాలతి తెలిపారు. జిల్లాలో గత ఏడాది మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, అతిసారా, టైఫాయిడ్ కేసులు ఎక్కడెక్కడో నమోదయ్యాయో గుర్తించి ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఇక రాపిడ్ యాక్షన్ టీమ్‌లను ఏర్పాటుచేసి సీజనల్ వ్యాధుల నివారణకు గంబూషియా చేపలు సరఫరా చేయాలని మత్య శాఖ అదనపు డైరెక్టర్‌కు, ఆయిల్ బంతులు తయారు చేయించాలని మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాసినట్లు ఆమె తెలిపారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అధికారులను సిద్ధం చేశామని చెప్పారు. కాగా, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జిల్లా ఆస్పత్రుల మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎల్.కిరణ్(94404 04161), డాక్టర్ కిరణ్(96404 38733), డాక్టర్ బాబు రత్నాకర్(98481 61331), ఆర్‌ఎంఓలు డాక్టర్ రాంబాబు (96662 95855), డాక్టర్ విజయ్ రాథోడ్(94949 41691లను డీఎంహెచ్‌ఓ సూచించారు. ఇదేసమయాన ప్రజలు కూడా ఇళ్లు, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, జ్వరం వస్తే పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. కాగా, ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ప్లేట్‌లెట్లు పడిపోయాయని ప్రజలకు భయపెట్టకుండా అనుమానితుల శాంపిళ్లను ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాకే నిర్ధారించుకోవాలని డీఎంహెచ్‌ఓ శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆదేశించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడిన ట్రాక్టర్

- ట్రాక్టర్ ఇంజన్‌తో పాటు పడిపోయిన మహిళ
- మోటార్ బయటకు తీస్తుండగా ఘటన



బావిలో పడిన ట్రాక్టర్‌ను తీస్తున్న దృశ్యం



మాధవికి చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది

నేలకొండపల్లి: బావిలో ఉన్న మోటార్‌ను ట్రాక్టర్ సాయంతో లాగే క్రమాన ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌తో పాటు మహిళ బావిలో పడగా తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటనకు సంబంధించి వివరాలు... నేలకొండపల్లి మండలం బైరవునిపల్లికి చెందిన బాలిన వీరబాబు నాలుగు ఎకరాల భూమి కౌలుకు చేస్తున్నారు. ఇటీవల బావిలో పూడిక తీయించగా శనివారం బావిలోని మోటార్‌ను బయటకు తీసేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా వీరబాబు, ఆయన భార్య మాధవి వెళ్లగా వీరబాబు బావిలోకి దిగి తాడు మోటార్‌కు కట్టాడు. అనంతరం పైన ఉన్న మాధవిని ట్రాక్టర్ ముందుకు తీసుకెళ్లాలని సూచించగా ఆమెకు అవగాహన లేక రివర్స్ గేర్ వేయడంతో ట్రాక్టర్ ఇంజన్ వెనకకు వెళ్లి బావిలో పడింది. ఆ సమయాన ఇంజన్‌పై కూర్చున్న మాధవి కూడా పడి నీట మునగసాగింది. ఈ విషయాన్ని గుర్తించిన వీరబాబు గట్టిగా కేకలు వేయడంతో సమీప రైతులు చేరుకుని దంపతులను బయటకు తీసుకొచ్చారు. ఘటనలో మాధవికి తీవ్ర గాయాలు కాగా నేలకొండపల్లిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. కాగా, బావిలో పూర్తి స్థాయిలో నీరు లేకపోవటంతో ఇరువురు ప్రాణాలతో బయటపడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కారేపల్లి: కారు, లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలైన ఘటన కారేపల్లి మండలంలోని శాంతినగర్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి జిల్లా పాల్వంచకు చెందిన టి.ప్రతాప్, సావిత్రమ్మ, ఉష ఖమ్మం నుంచి పాల్వంచ వైపు కారు.. ఖమ్మం వైపు వెళ్లుతున్న లారీ శాంతినగర్ వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ఉన్న ప్రతాప్, సావిత్రమ్మ, ఉష గాయపడగా ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై క్షతగాత్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.రాజారాం తెలిపారు.

రాజీ మార్గమే రాజమార్గం



కేసు వివరాలు పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి దీప

కామేపల్లి: రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా జరిగే మేలుపై అందరూ అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.దీప సూచించారు. కామేపల్లి రైతువేదికలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ మొబైల్ కోర్టు నిర్వహించగా ఆమె పాల్గొన్నారు. సమయం, డబ్బు ఆదా అయ్యేలా రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌లు దోహదపడతాయని తెలిపారు. ఈ విషయంలో ఎక్కువమంది కక్షిదారులు ముందుకొచ్చేలా అవగాహన కల్పించాలని పోలీసులకు సూచించారు. కాగా, 2021లో జరిగిన దాడి ఘటనపై పండితాపురానికి చెందిన బాదావత్ సర్వస్, లక్ష్మాపై కేసు నమోదు కాగా రాజీ పడడంతో కేసు పరిష్కారమైంది. ఏపీపీ వి.నర్సయ్య, సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఉద్యోగులు మొగిలి వెంకటేశ్వర్లు, లలిత, రమేశ్, జె.రవి, ఆదినారాయణ, రఫీయుద్దీన్, నవీన్ పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత

ఖమ్మం సహకారనగర్: ధరణి దరఖాస్తులను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శనివారం ఆయన జిల్లాల అధికారులతో ధరణి దరఖాస్తులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈనెల 15 నుంచి 28 వరకు పరిష్కరించిన దరఖాస్తులపై ఆరా తీయడంతో పాటు మిగతా వాటిపై సూచనలు చేశారు. అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారించాక ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఇక ఆధార్ బయోమెట్రిక్ వేలిముద్రల నమోదుకు సంబంధించి కొత్త పరికరాలు అమర్చడంపై దృష్టి సారించాలని, ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సమీకృత గురుకులాల నిర్మాణానికి 20 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని సూచించారు. జిల్లా నుంచి వీసీకి అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఆర్డీఓలు జి.గణేష్, ఎల్.రాజేందర్, తహసీల్దార్లు హాజరయ్యారు.

బాలకార్మికులు ఉండొద్దు..

ఖమ్మంక్రైం: బాలకార్మికులు లేని సమాజ స్థాపనే అందరి లక్ష్యం కావాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ వి.అశోక్‌కుమార్ సూచించారు. సోమవారం నుంచి మొదలుకానున్న ఆపరేషన్ ముస్కాన్‌పై ఆయన హైదరాబాద్ నుంచి శనివారం జిల్లాల అధికారులతో సమీక్షించారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చడం, అనాథలకు పునరావాసం కల్పించడంపై దృష్టి సారించాలని తెలిపారు. పోలీస్‌శాఖతోపాటు మహిళా, శిశు సంక్షేమశాఖ, కార్మికశాఖ, విద్యా, వైద్య, ఆరోగ్యశాఖ, రెవెన్యూ శాఖ అధికారులే కాక స్వచ్ఛంద సంస్థలు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీల బాధ్యులు పాలుపంచుకోవాలని చెప్పారు. ఈ వీసీకి జిల్లా నుంచి అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్, అధికారులు లింగయ్య, లక్ష్మయ్య, డాక్టర్ ప్రమీల, విష్ణుచందన తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రఘునాథపాలెం: మండలంలోని వీఆర్.బంజర్‌లో శనివారం తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన నువ్వుల రమేష్ ఇంటికి తాళం వేసి ఆస్ట్రేలియాలో ఉన్న కుమార్తె వద్దకు నెల క్రితం వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు శనివారం తాళం పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు సమీప బంధువులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ శ్రీహరి పరిశీలించి యజమానుల ద్వారా ఫోన్‌లో వివరాలు సేకరించారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

■ MSR Developers కొరకు తెలంగాణ / ఆంధ్రాల్లో మార్కెటింగ్ సిబ్బంది కావలెను & మీరు ఉన్న ఏరియాల్లోనే లేఅవుట్ వెంచర్ ఫాం ల్యాండ్ పార్ట్‌నర్స్ కావలెను. ఫోన్: 8499940666 [H-189680]

PLAT FOR SALE
■ ఖమ్మం కార్పొరేషన్ లిమిట్స్‌లో ఇల్లందు రోడ్‌లో ఖానాపురం ప్రశాంతి నగర్, హరిత గార్డెన్స్ బ్యాక్ సైడ్ తూర్పు ఫేస్ 40 ఫీట్ రోడ్, ఫుల్ LRS కలిగిన 133 గజాల 2 ప్లాట్లు అమ్మకానికి కలవు. 94400 13145 [M-1185257]

Services

■ Any person who is having a new business idea can contact us for help in starting the business. Contact us by whatsapp on 7799577335 [B-1239452]

BUSINESS OFFER
■ KORIFY TRADERS కంపెనీలో అతి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే గొప్ప అవకాశం. డైలీ బ్యాంక్ ట్రాన్స్‌ఫర్. Dont Miss. Cell : 63016 93200, 95731 95350. [M-1185256]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185230]

■ ఖమ్మంలోని వెలాసిటి Network నందు చేయుటకు సేల్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్, టెక్నికల్, ఫైబర్స్, హెల్పర్స్ వెంటనే కావలెను. సంప్ర. 9908022621, 8886661780 [M-1185253]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-800412]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఫ్రీ వసతి/భోజనం జీతం : 18K ఫోన్: 9160900024 / 9640400073 [H-799897]

■ Daily Walk-in-Interviews English, Social, NS, PS, Maths. Salary 19,000 to 20,000 Little Flowers High School (EM), Bhadrachalam. Cell : 96180 01900. [M-1185169]

WANTED TEACHERS
■ Wanted Lady Teachers Pre-Primary Teachers, Below 30 Years (Fluency English Must) మరియు ఆయాలు కావలెను. ఆకర్షణీయమైన జీతం గాంధీచౌక్, ఖమ్మం. సంప్ర॥ 93927 78297, 91005 40892. [M-1185252]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి.

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
కొత్తగూడెం	: 9010223783
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792


సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మూడు వారాల్లో
రూ.7 వేల కోట్ల అప్పు

ఆర్బీఐకి వెల్లడించిన చంద్రబాబు ప్రభుత్వం

- ఎల్లో మీడియాకు ప్రతి మంగళవారం బాబు అప్పులు కనిపించడం లేదా?
- లేక ఈ అప్పులే సంపద సృష్టిలా కనిపిస్తోందా?
- గతంలో వైఎస్ జగన్ సర్కార్‌పై ప్రతి మంగళవారం అప్పు అంటూ విషం కక్కిన ఎల్లో మీడియా
- ఇప్పుడు బాబు అంటే ఇష్టం కాబట్టి అప్పు ఊసెత్తని వైనం
- ఈ నెల 25న రూ.2 వేల కోట్లు, వచ్చే నెల 2న రూ.5 వేల కోట్ల అప్పు



సాక్షి, అమరావతి: ప్రతి మంగళవారం అప్పు చేయందే గడవదంటూ ఇన్నాళ్లు వైఎస్ జగన్ సర్కారుపై రాసిందే పదే పదే రాస్తూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియా విషం కక్కాయి. ఇప్పుడు చంద్రబాబు సర్కారు ప్రతీ మంగళవారం అప్పు చేస్తున్నా ఈనాడు, ఆంధ్రజ్యోతి తదితర ఎల్లో మీడియాకు కనిపించడం లేదా? అని అధికార వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. బాబు సర్కారు ప్రతి మంగళవారం చేస్తున్న అప్పులు ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియాకు సంపద సృష్టిస్తున్నట్లు కనిపిస్తోందా.. అంటూ ఎద్దేవా చేస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు సెక్యూరిటీల విక్రయం ద్వారా అప్పులు చేయడానికి వెసులు బాటు కల్పిస్తూ ప్రతి మూడు నెలలకు ఆర్‌బీఐ వేలం వేసే తేదీలను ముందుగానే ప్రకటిస్తుంది. ఆయా తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత మేర అప్పు చేస్తాయో.. ఎన్ని సంవత్సరాల కాల వ్యవధిలో ఆ అప్పు తీరుస్తాయో ఆర్‌బీఐకి తెలియజేస్తాయి. అదే తరహాలో గత వైఎస్ జగన్ సర్కారు పరిమితికి లోబడి అప్పులు చేస్తే.. ప్రతి మంగళవారం అప్పు అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియా నిత్యం దుష్ప్రచారం చేస్తూ కథనాలు వండి వారుస్తూ నానా యాగీ చేశాయి. ఇప్పుడు చంద్రబాబు సర్కారు 20 రోజుల వ్యవధిలోనే రూ.7000 కోట్లు అప్పు చేసినా.. అదీ ప్రతి మంగళవారం అప్పు చేస్తున్నా ఈనాడు, ఆంధ్రజ్యోతి తదితర ఎల్లో మీడియాకు కనిపించడం లేదు. దాని గురించి ఒక్క ముక్క రాయడం లేదు. అంటే తమకు ఇష్టుడైన చంద్రబాబు అధికారంలో ఉన్నందున, ఎన్ని అప్పులు చేసినా.. ఆ పత్రికలకు సంపద సృష్టిలా కనిపిస్తుందేమోనని ఉన్నతాధికారి ఒకరు ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ అంటే ఇష్టం లేనందున పరిమితికి లోబడి అప్పులు తెచ్చినా సరే ప్రతి మంగళవారం అప్పు చేయనిదే గడవదంటూ పెద్ద నేరం చేసినట్లు నిత్యం ఆ పత్రికలు కథనాలు రాసినట్లు ఇప్పుడు స్పష్టం అవుతోందని ఆ అధికారి విశ్లేషించారు.

సంపద సృష్టి ఏమైందో!

వైఎస్ జగన్ సర్కారు అప్పులు చేసి రాష్ట్రాన్ని శ్రీలంకలా మార్చేశారంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియాతో పాటు చంద్రబాబు, పురందేశ్వరి, పవన్ కళ్యాణ్‌లు విషం కక్కారు. చంద్రబాబు అయితే ఒక అడుగు ముందుకు వేసి అప్పులు చేయడం కాదు.. సంపద సృష్టిస్తానని, ఆ సంపద ఎలా సృష్టించాలో తనకే తెలుసంటూ ఎన్నికల ముందు ప్రచారం చేశారు. ఇంత గట్టిగా బల్లగుద్ది చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రతి మంగళవారం అప్పులు చేస్తామంటూ ఆర్‌బీఐకి స్పష్టం చేసింది. ఇదే సందర్భంలో ప్రతి మంగళవారం అప్పులతో పాటు ఎంత సంపద సృష్టిస్తారో కూడా చెబితే బాగుంటుందని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ నెల 25వ తేదీన సెక్యూరిటీల వేలం ద్వారా రూ.2,000 కోట్లు అప్పు చేసిన చంద్రబాబు సర్కారు.. వచ్చే నెల 2వ తేదీన మంగళవారం మరో రూ.5,000 కోట్లు అప్పు చేస్తోంది. వచ్చే నెల 2వ తేదీన రూ.1,000 కోట్లు తొమ్మిది సంవత్సరాల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 12 ఏళ్ల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 17 ఏళ్ల కాల వ్యవధికి, ఇంకో రూ.1,000 కోట్లు 21 ఏళ్ల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 24 ఏళ్ల కాల వ్యవధికి సెక్యూరిటీల విక్రయం ద్వారా అప్పు చేయనుంది. ఆ తర్వాత మంగళవారం కూడా అప్పు చేయనున్నట్లు చంద్రబాబు సర్కారు ఆర్‌బీఐకి తెలియజేసింది.

రెడ్‌బుక్ ఉన్మాదమిది

ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి టీడీపీ శ్రేణుల ఆగడాలకు హద్దే లేకుండా పోయింది. ప్రధానంగా గ్రామాల్లో, ఎస్సీ, ఎస్టీ వాడల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతి పరులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. జేసీబీలతో ఇళ్లను కూలదోస్తున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులని కూడా చూడకుండా చితకబాదుతుండటం ఊరూరా కనిపిస్తోంది. శిలాఫలకాలు, వైఎస్సార్ విగ్రహాలను తొలగిస్తున్నారు.. పగలగొడుతున్నారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి దళితవాడలో శనివారం ఉదయం 6 గంటలకు అందరూ చూస్తుండగానే టీడీపీ వర్గీయులు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఇదేం కక్ష సాధింపు? గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారాయి. ఎవరైనా ఇలా చేశారా? అధికారం చేజిక్కించుకుంటే ఇలా దాడులు చేయడానికి, ఆస్తులు ధ్వంసం చేయడానికి లైసెన్స్ వచ్చినట్లా? లేక అధికారంతో పాటు హిస్టీరియా ఏమైనా వచ్చిందా? రెడ్ బుక్.. రెడ్ బుక్.. అంటూ లోకేశ్‌కు వచ్చిన పూనకం తాలూకు ఉన్మాదమే ఇప్పుడు ఆ పార్టీ శ్రేణులకూ నరనరాన ఎక్కినట్లుంది. రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చడమే మీ ఉన్మాద లక్ష్యం అయితే.. ప్రజాగ్రహ జ్వాల ఉవ్వెత్తున ఎగిసి పడటం ఖాయం. ఆ సెగలో మాడి మసి అవుతారో.. లేక పద్ధతి మార్చుకుని బుద్ధిగా పాలన సాగిస్తారో మీరే తేల్చుకోండి.



అద్దేపల్లిలో టీడీపీ నాయకులు పెట్రోల్ పోసి తగలపెట్టిన వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం

- బాపట్ల జిల్లా అద్దేపల్లిలో పేట్రేగిన టీడీపీ నాయకులు
- పెట్రోల్ పోసి వైఎస్సార్ విగ్రహానికి నిప్పు
- తమ జెండా స్థూపం పగులగొట్టారంటూ టీడీపీ రివర్స్ ఫిర్యాదు
- ఇరువర్గాలపై కేసులు నమోదు చేసిన పోలీసులు
- దళితవాడలో ఉద్రిక్తత.. పోలీస్ పికెట్ ఏర్పాటు

అద్దేపల్లి (భట్టిప్రోలు)/సాక్షి ప్రతినిధి బాపట్ల: టీడీపీ మాజీమంత్రి నక్కా ఆనందబాబు ఎమ్మెల్యేగా ఉన్న వేమూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు బరితెగించారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధి అద్దేపల్లి దళితవాడలో శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో అందరూ చూస్తుండగానే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. విగ్రహం ముప్పావు భాగానికి పైగా దగ్ధమైంది. దీంతో దళితవాడలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయితే, వైఎస్సార్ విగ్రహానికి సమీపంలో ఉన్న టీడీపీ జెండా దిమ్మెను వైఎస్సార్‌సీపీ వారు పగులగొట్టారని, అందుకు ప్రతీకారంగా వైఎస్ విగ్రహాన్ని తగులబెట్టినట్లు టీడీపీ వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. కానీ, టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే తమను రెచ్చగొట్టేందుకు జెండా దిమ్మెను కొద్దిగా పగులగొట్టుకుని ఆ సాకుతో వైఎస్ విగ్రహాన్ని కాల్చివేశారని వైఎస్సార్‌సీపీ నేతలు వాదిస్తున్నారు.

ఇరువర్గాలూ పరస్పర ఫిర్యాదులు

జిల్లాలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు అనంతరం టీడీపీ అరాచకపర్వం కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా టీడీపీ నేతలు దాడులు చేస్తూ వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. దీంతో చాలామంది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు గ్రామాలు వదిలి వెళ్లిపోయారు. ఈ పరిస్థితిలో టీడీపీ జెండా దిమ్మెలను పగులగొట్టే పరిస్థితి వైఎస్సార్‌సీపీ నేతలకు లేదన్నది టీడీపీ నేతలకూ తెలుసు. కాకపోతే ఏదో సాకుచూపి విధ్వంసాన్ని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. టీడీపీ కార్యకర్తలే వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని ఏడు మందిపై వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. టీడీపీ జెండా దిమ్మె ధ్వంసం చేశారంటూ టీడీపీ నేతలు ప్రతిగా 14 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై కేసులు : ఎస్‌ఐ

ఈ ఘటన సమాచారం అందుకున్న వేమూరు సీఐ పి.రామకృష్ణ, ఎస్‌ఐ కాసుల శ్రీనివాసరావు, సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విషయం తెలుసుకున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ కూడా భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. కాగా, వైఎస్సార్ విగ్రహం దగ్ధం చేసిన ఏడుగురిపై వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై 435, 427, 507 ఆర్/34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. మరోవైపు టీడీపీ జెండా దిమ్మను ధ్వంసం చేసినట్లు ఆ పార్టీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. దళితవాడలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. ఇదిలా ఉంటే..

విగ్రహాలు ధ్వంసం హేయం : మేరుగు

స్ఫూర్తిని నింపిన మహనీయుల విగ్రహాల ధ్వంసం, దహనం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అని మాజీమంత్రి మేరుగు నాగార్జున అన్నారు. విగ్రహం దహనం విషయం తెలుసుకున్న ఆయన అద్దేపల్లిని సందర్శించి విగ్రహాన్ని పరిశీలించారు. టీడీపీ దురాగతాన్ని ఖండించారు.

హుటాహుటిన మరొక విగ్రహం ఏర్పాటుకు యత్నం

వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు శనివారం రాత్రి అద్దేపల్లి విచ్చేసి కాలిపోయిన వైఎస్ విగ్రహాన్ని పరిశీలించారు. అక్కడే వైఎస్సార్ మరో విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. విగ్రహం ఏర్పాటు పూర్తయ్యే వరకూ ఆయన స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని మౌన దీక్ష చేశారు. దళితవాడ ప్రజలు అండగా వచ్చి ఆయనకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. రాత్రి 10గంటల ప్రాంతంలో పోలీసులు అశోక్‌బాబు దీక్షను భగ్నంచేసి ఆయన్ను రేపల్లె తరలించారు. అక్కడా ఆయన పోలీసు వాహనం దిగకుండా దీక్ష కొనసాగిస్తున్నారు. మహిళలు, చిన్నారులు అని చూడకుండా పోలీసులు నిర్దాక్షిణ్యంగా లాఠీచార్జి చేశారు. విగ్రహాన్ని దగ్ధం చేయడం గ్రామ చరిత్రలో బ్లాక్ డేగా నిలిచిందని.. చంద్రబాబు రాక్షస పాలనకు ఇది పరాకాష్టని అశోక్‌బాబు మండిపడ్డారు.

కృషి, పట్టుదలతో మరో గొప్ప గెలుపు

భారత క్రికెట్ జట్టుకు జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: టీ20 వరల్డ్ కప్ గెలుచుకున్న భారత క్రికెట్ జట్టుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. కృషి, పట్టుదలతో మరో గొప్ప గెలుపు సొంతం చేసుకుందని ప్రశంసించారు. టోర్నీ ఆద్యంతం సమష్టి కృషితో భారత జట్టు విజయాలు సాధించిందన్నారు. వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో ఓటమితో తీవ్ర నిరాశకు గురైన అభిమానులకు ఈ విజయం గొప్ప ఊరటనిస్తుందని అభిప్రాయపడ్డారు. భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ తెలుగువాడు కావడం గర్వకారణమన్నారు. జట్టును విజయవంతంగా నడిపించడంలో అతడు చక్కటి నాయకత్వాన్ని ప్రదర్శించాడని కొనియాడారు. రానున్న రోజుల్లో టీమ్ ఇండియా మరిన్ని చాంపియన్‌షిప్‌లు సాధించాలని ఆకాంక్షించారు.

రాష్ట్రంలో అరాచకం ▸ రాజ్యమేలుతోంది

రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన శ్రేణులు పేట్రేగిపోతున్నాయి

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నాయి

- పార్టీ, ప్రభుత్వ కార్యాలయాల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయి
- శాంతిభద్రతలు క్షీణించాయి.. ప్రభుత్వం పట్టించుకోవడంలేదు
- గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- టీడీపీ అరాచకాలను అరికట్టాలని గవర్నర్‌కు వినతి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జిల్లా వార్తలు

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి పలువురు శనివారం విరాళాలు అందచేశారు. ఖమ్మంకు చెందిన ఎస్.భాస్కర్‌రావు దంపతులు రూ.లక్ష, హైదరాబాద్ ప్రగతినగర్‌కు చెందిన ఆర్.పద్మనాధరావు – సుభద్ర దంపతులు రూ.50వేలను ఆలయ అధికారులకు అందచేసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు ఎల్.సాయిబాబు, దాతల కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో సీఆర్‌పీఎఫ్ డీఐజీ

శ్రీ సీతారామ చంద్రస్వామిని కుంట సీఆర్‌పీఎఫ్ డీఐజీ సూరజ్ పాల్ వర్మ శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులు, శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకోగా పండితులు వేదాశీర్వచనం, ప్రసాదాలు, జ్ఞాపిక అందచేశారు. ఆలయ అధికారులు, సీఆర్‌పీఎఫ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు 'కగార్' వ్యతిరేక దినంగా పాటించండి

చర్ల: జూలై 1వ తేదీన ప్రపంచ కగార్ వ్యతిరేక దినంగా పాటించాలని భారత ప్రజాయుద్ధ అంతర్జాతీయ సంఘీభావ కమిటీ పిలుపునిచ్చిందని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామ రాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ వెల్లడించారు. ఈ మేరకు సంఘీభావ కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ అన్నివర్గాల ప్రజలు కగార్ వ్యతిరేక పోరాటంలో కలిసిరావాలని శనివారం విడుదల చేసిన లేఖలో కోరారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆపరేషన్ కగార్ పేరుతో ప్రజాయుద్ధాన్ని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైనిక బలగాలను రంగంలోకి దింపగా, ఇప్పటివరకు 125 మందికి పైగా మావోయిస్టు కార్యకర్తలు, నాయకత్వాన్ని హతం చేశాయని తెలిపారు. ఇందులో సామాన్య పౌరులు సైతం ఉన్నారని పేర్కొన్నారు. ఇకనైనా కగార్ దాడిని ఆపాలనే డిమాండ్‌తో చేస్తున్న పోరాటంలో అన్నివర్గాల ప్రజలు కలిసిరావాలని ఆజాద్ కోరారు.

'సన్న' విత్తనాలకు డిమాండ్

- ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో సాగుకు రైతుల మొగ్గు
- సరిపడా అందుబాటులో లేని వరి విత్తనాలు
- తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ వద్ద అరకొరగానే...
- ఇదే అదనుగా ధర పెంచుతున్న డీలర్లు



ఓ డీలర్ వద్ద వరి విత్తనాల సంచులు

ఖమ్మంవ్యవసాయం: సన్న వరి విత్తనాలకు డిమాండ్ పెరిగింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో సాగు అంచనాలకు తగినట్లుగా అందుబాటులో లేవు. రాష్ట్రప్రభుత్వం సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఈ సీజన్ నుంచే ఇస్తామని ప్రకటించడంతో సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈనేపథ్యాన కొందరు రైతులు గత ఏడాది తాము సాగు చేసిన పంట నుంచి విత్తనాలను సిద్ధం చేసుకోగా.. ఇంకొందరు ప్రభుత్వ, ప్రైవేట్ విత్తనాల కోసం పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ పరంగా వరి విత్తనాలను తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేస్తున్నా ఒకటి, రెండు రకాలు అరకొరగానే ఉన్నాయి. దీంతో రైతులు అవసరాన్ని ఆసరా చేసుకుంటున్న డీలర్లు ప్రైవేట్ కంపెనీల విత్తనాల ధర పెంచుతున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట

ఖమ్మం ఉమ్మడి జిల్లాలో వరి ప్రధాన పంటగా సాగవుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు తోడు తాలిపేరు తదితర ప్రాజెక్టుల ఆధారంగా 4.40 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. గత ఏడాది మునుపెన్నడూ లేని విధంగా సన్న ధాన్యానికి డిమాండ్ పెరిగింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,203 కాగా, మిల్లర్లు పచ్చి ధాన్యానికే రూ.2,600 నుంచి రూ.3 వేల వరకు చెల్లించారు. ఇంతలోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సన్న ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించటంతో ఈ ఏడాది రైతులంతా సన్న వరి రకాల సాగుకే ప్రాధాన్యత ఇస్తూ ఆయా రకాల విత్తనాల ఎంపికలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొందరు నార్లు పోయడంలో నిమగ్నం కాగా, వర్షాల ఆధారంగా జూలై నుంచి సాగు ముమ్మరమయ్యే అవకాశం ఉంది.

విత్తనాలు ఎక్కడ?

పత్తి, మిర్చి వంటి విత్తనాలను ప్రభుత్వ అనుమతితో ప్రైవేట్ కంపెనీలు విక్రయిస్తాయి. కానీ వరిలో మాత్రం పంట సాగును పరిగణనలోకి తీసుకుని 40 నుంచి 50 శాతం మేర విస్తీర్ణానికి సరిపడా ప్రభుత్వం వివిధ సంస్థల ద్వారా పంపిణీ చేస్తుంది. మిగిలిన విస్తీర్ణానికి రైతులే తాము సాగు చేసిన పంట విత్తనాలనే మరుసటి ఏడాది వినియోగిస్తారు. ఇక కొన్ని కంపెనీలతో రైతులతో సాగు చేయించి విత్తనాలు తీసుకుని తిరిగి విక్రయిస్తుంటాయి. ఈ నేపథ్యాన రైతులు ఎక్కువ మంది సన్న రకాల సాగుకు ప్రాధాన్యత ఇస్తుండడంతో డిమాండ్ పెరిగింది.



వరి పైరు

జిల్లాల వారీగా వరి సాగు (ఎకరాల్లో)

ఖమ్మం	2.83 లక్షలు
భద్రాద్రి కొత్తగూడెం	1.56 లక్షలు

విత్తనాభివృద్ధి సంస్థ వద్ద అరకొరగానే...

రైతులు సన్న రకాల్లో సాంబమసూరి(5204), ఆర్‌ఎన్‌ఆర్-15048, తెలంగాణ సోనా, తెలంగాణ సాంబ, కేఎన్‌ఎం-118, సిద్ధి, చింటు, జైశ్రీరాం, పూజ, వరంగల్, జగిత్యాల వంటి వరి రకాల సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ వద్ద అరకొరగా నిల్వలు ఉన్నాయి. సన్న రకాల్లో ప్రధానమైన బీపీటీ 5204 రకం విత్తనాలు 800 క్వింటాళ్లే ఉండగా, ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం కేవలం 300 క్వింటాళ్లే ఉండడంతో వివిధ ప్రాంతాలకు పంపించారు. అధికారులు మాత్రం కరీంనగర్, వరంగల్ ప్రాంతాల నుంచి విత్తనాలు తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని చెబుతున్నారు. 2015–16లో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం యూనిట్ 15 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను సరఫరా చేయగా, ప్రస్తుతం వెయ్యి క్వింటాళ్లకు పడిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. కాగా, కొరతను ఆసరాగా చేసుకున్న డీలర్లు 25 నుంచి 30 కిలోల విత్తన సంచి రూ.1,000 నుంచి రూ.1,100 వరకు ఉండగా రూ.100 నుంచి రూ.200 వరకు పెంచి విక్రయిస్తున్నారు.

సన్నరకాల కోసం అన్వేషణ



ఆరు ఎకరాల్లో వరి సాగు చేయాలని భావిస్తున్నా. ప్రభుత్వ బోనస్ ప్రకటనతో సన్న రకాల విత్తనాల కోసం ఆరా తీస్తున్నా. ఎంటీయూ 1061 సాగు చేసే ఆలోచన ఉండగా.. ఆ రకాన్ని సన్నరకంగా గుర్తిస్తారా, లేదా స్పష్టత లేదు. అయితే, ఆ విత్తనాలూ లభించడం లేదు.

– రాణాప్రతాప్, వల్లాపురం, వైరా మండలం

ప్రైవేట్‌లో కూడా లేవంటున్నారు..



వరి విత్తనాలు ఎక్కడా లభించటం లేదు. ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం కోసం ప్రయత్నిస్తే ప్రభుత్వం నుంచి ఇంకా రాలేదని చెబుతున్నారు. ప్రైవేట్ డీలర్లు కూడా లేవని చెబుతున్నారు. దీంతో ధర ఎక్కువైనా ఇతర ప్రైవేట్ రకాలను ఎంపిక చేసుకోవాలని భావిస్తున్నా. – నాగండ్ల వెంకటేశ్వర్లు, ఎదుళ్లచెరువు, తిరుమలాయపాలెం మండలం

విత్తనాల కొరత రాకుండా చర్యలు



వరిలో సన్న రకాల విత్తనాల కొరత రాకుండా చూస్తున్నాం. విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కావాల్సిన రకాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. అలాగే, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో కూడా సంప్రదిస్తున్నాం. డీలర్లు ధరలు పెంచితే చర్యలు తీసుకుంటాం. – ఎం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి, ఖమ్మం జిల్లా

లోపభూయిష్టంగా వెయిటేజీ కేటాయింపు

సింగరేణిలో కార్మికుల ఆవేదన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగాల(ఇంటర్నల్) భర్తీకి నిర్వహించే పరీక్షల్లో అధికారులు అవలంబిస్తున్న విధానాలను కార్మికులు తప్పుపడుతున్నారు. ప్రకృతికి విరుద్ధంగా వందల అడుగుల లోతులో పనిచేస్తున్న కార్మికులకు, ప్రశాంత వాతావరణంలో కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు ఒకే రకమైన వెయిటేజీ మార్కులు ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా తాము ఏళ్ల పాటు గనులకే పరిమితమవుతుండగా, ఇతర ఉద్యోగులు త్వరగా పదోన్నతులకు అర్హత సాధిస్తున్నారని చెబుతున్నారు. సంస్థలో ఉద్యోగాల భర్తీకి ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్లు జారీచేస్తుండగా మొదటి నోటిఫికేషన్‌కు సంస్థ ఉద్యోగులను అర్హులుగా పరిగణిస్తారు. ఈనేపథ్యాన హాజరుశాతం ఆధారంగా గనుల్లో లేదా కార్యాలయాల్లో ఎక్కడ పనిచేసినా హాజరు శాతం ఆధారంగా ఏడాదికి ఒక మార్కు, ఆరేళ్ల పనిచేస్తే రెండు, ఏడేళ్లకు మూడు, ఎనిమిదేళ్లకు నాలుగు, తొమ్మిది నుంచి ఆపై ఎన్నేళ్లు పనిచేసినా అందరికీ సమానంగా ఐదు మార్కులే కేటాయిస్తున్నారు. తద్వారా కార్యాలయాల్లో పనిచేస్తూ విద్యార్హతలు ఉన్న వారు ఈ వెయిటేజీ ఆధారంగా త్వరగా పదోన్నతులు పొందుతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కనీసం ఐదేళ్లు అండర్ గ్రౌండ్‌లో పనిచేసిన అనుభవం ఉన్న వారికి లబ్ధి జరిగేలా మార్పులుచేయాలని, అండర్ గ్రౌండ్‌లో పనిచేసే వారికి 20, సర్ఫేస్‌లో పనిచేసే వారికి 15 వెయిటేజ్ మార్కులు కేటాయిస్తే తమకు న్యాయం జరుగుతుందని కోరుతున్నారు. అంతేకాక సంస్థల్లో విధుల్లో చేరిన ప్రతిఒక్కరూ కచ్చితంగా ఐదేళ్లు అండర్ గ్రౌండ్‌లో పనిచేయాలనే నిబంధన తీసుకురావాలని విన్నవిస్తున్నారు.



గడచిన ఆరు నెలల్లో 487 మంది ఉద్యోగ విరమణ

- మెడికల్ ఇన్‌వాలిడేషన్‌లో ఉద్యోగాల భర్తీ అంతంతే..
- సింగరేణిలో నానాటికీ తగ్గుతున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం) సింగరేణి సంస్థలో ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 487 మంది ఉద్యోగ విరమణ పొందారు. రానున్న ఆరు నెలల్లో మరో 500 మంది రిటైర్ కానున్నారు. ఇలా సింగరేణిలో రోజురోజుకూ కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నా యాజమాన్యం కంటితుడుపు చర్యగా వందల సంఖ్యలోనే నియామకాలు చేపడుతుందనే విమర్శలు వస్తున్నాయి. అలాగే, 2018 నుండి నిర్వహించిన 109 మెడికల్ బోర్డ్‌ల్లో సుమారు 21 వేల మంది మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కాగా సుమారు 15వేల మందికి డిపెండెంట్లుగా ఉద్యోగాలు ఇచ్చారు. ఇక మిగతా 6వేల ఉద్యోగాల పరిస్థితి ఏమిటన్నది తేలడం లేదు. సంస్థలో 1998లో 1.16 లక్షల మంది కార్మికులు, సుమారు 2,400మంది అధికారులు ఉండేవారు. ప్రస్తుతం 39 వేల మంది కార్మికులు పనిచేస్తుండగా, అధికారుల సంఖ్య మాత్రం తగ్గలేదు. సంస్థలో ఒక్క అధికారి రిటైర్ కాగానే ఖాళీల వివరాలను ఐఈడీ విభాగం రిక్రూట్‌మెంట్ సెల్‌కు పంపుతుండగా, కార్మికుల విషయంలో అలా జరగకపోవడంతో నానాటికీ సంఖ్య తగ్గిపోతోంది. ఇకనైనా యజమాన్యం స్పందించకపోతే వచ్చే కొన్నేళ్లలో సింగరేణిలో కార్మికుల సంఖ్య మరింత పడిపోయే అవకాశముందని చెబుతున్నారు.

నేడు ఈపీ ఆపరేటర్ నియామక రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 100 ఈపీ ఆపరేటర్ ట్రైయినీ కేటగిరీ-5(ఇంటర్నల్)పోస్టుల భర్తీకి ఆదివారం కొత్తగూడెంలోని సింగరేణి డిగ్రీ, మహిళా పీజీ కళాశాలలో రాతపరీక్ష నిర్వహించనున్నారు. ఇప్పటికే అభ్యర్థులకు డ్రైవింగ్ పరీక్ష నిర్వహించగా ప్రతిభ కనబర్చిన వారిని రాతపరీక్షకు ఎంపిక చేశారు. ఈమేరకు అభ్యర్థులు డ్రైవింగ్ టెస్ట్ కాల్‌లెటర్‌తో హాజరుకావాలని, ఉదయం 8గంటల నుంచే అనుమతించనుండగా 10గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) బీ.ఆర్.దీక్షితులు స్పష్టం చేశారు. కాగా, పరీక్ష ఫలితాలను ఆదివారం రాత్రి సింగరేణి ప్రధాన కార్యాలయంతో పాటు వెబ్‌సైట్‌లో విడుదల చేస్తామని తెలిపారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగాల (ఎక్స్‌టర్నల్) భర్తీకి ఫిబ్రవరిలో విడుదలైన నోటిఫికేషన్ ఆధారంగా దరఖాస్తుల స్వీకరణ శనివారం ముగిసింది. ఈ నోటిఫికేషన్‌లో రెండు రకాల ఎగ్జిక్యూటివ్ కేడర్లు కలిపి 327 పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించారు. కాగా, ఈ ఏడాది జనవరిలో విడుదల చేసిన మొదటి నోటిఫికేషన్(ఎక్స్‌టర్నల్)లో 272 పోస్టులు ఉండగా 15 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆయా అభ్యర్థులకు జూలై నెలాఖరులో రాతపరీక్ష నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.